క్లుప్తంగా

ఎమ్మెల్యే పరిశీలన



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సోమవారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, దీనికి స్థానికులు, అధికారులు సహకరించాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్.మురళీకృష్ణ ఉన్నారు.

ఉల్లాసంగా ఆటల పోటీలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు పాఠశాలల్లో బాలికలకు సోమవారం నిర్వహించిన పలు ఆటల పోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగాయి. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 9వ తేదీన బొబ్బిలిలో న్యాయమూర్తి చేతుల మీదుగా బహుమతులు అందిస్తామని ఎంపీడీఓ ఎంపీడీఓ అల్లు భాస్కరరావు తెలిపారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ రూరల్ పీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ఇంటాబయట, పాఠశాలలో ఎక్కడైనా ఎవరి వల్లనైనా వేధింపులకు గురైతే తక్షణమే తల్లిదండ్రులు, పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు, హెచ్‌ఎం ఎం.అప్పారావు పాల్గొన్నారు.

నేడు వాకాడవలసలో పైడితల్లి సంబరాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని వాకాడవలస గ్రామంలో పైడితల్లి సంబరాలు మంగళవారం నిర్వహించనున్నారు. అంజలి రథోత్సవంతో పాటు ఘటాల సంబరాలు చేసి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

7న ఆలయ వార్షికోత్సవం

బొబ్బిలి రూరల్: మండలంలో సీతయ్యపేట కమలవాసిని లక్ష్మీదేవి ఆలయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త ఇల్లా మురళీధర్ సోమవారం తెలిపారు. ఉదయం అమ్మవారి విగ్రహ ఊరేగింపు, కుంకుమపూజలు, కల్యాణ మహోత్సవం, హోమం చేపడతామని, సాయంత్రం కోలాటం, సాముగరిడీల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వంగర: మండలంలోని మద్దువలసలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పిట్టా పద్మావతి సోమవారం తెలిపారు. అర్హులైన వారంతా ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదో తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

దుప్పట్లు, ప్లేట్లు వితరణ



విద్యార్థినికి దుప్పట్లు, ప్లేట్లు అందజేస్తున్న దాతలు

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 30 మంది దివ్యాంగ విద్యార్థులకు కొమరాడ మండలంలోని కదులగుంప గ్రామానికి చెందిన బెల్లాన గుంపస్వామి ఆయన భార్య గీతాంజలి కలిసి దుప్పట్లు, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు సోమవారం వితరణ చేశారు. ఆయన తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు వాటిని అందించడంతో పాటు పాఠశాలకు వాటర్ క్యాన్‌ను కూడా అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న ప్రచారం!

వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పార్టీ నేతల ప్రచారం జోరందుకుంది. సోమవారం ఓటర్ల ఇంటింటికీ వెళ్లి, మొదటి ప్రాధాన్యతా ఓటు సుధాకర్‌కే వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మరికొంతమంది వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ పార్టీ మద్దతు అభ్యర్థుల గెలుపు కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. విశాఖ రాజధాని కావాలన్న ఉత్తరాంధ్రుల బలమైన ఆకాంక్షను ఆయన గెలుపు ద్వారా చాటాలని, సుధాకర్‌కే మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని పిలుపునిస్తున్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో పాల్గొని, ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



బాడంగి: రామచంద్రాపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తెర్లాం: ఎన్.బూర్జవలసలో ప్రచారంలో పార్టీ నాయకుడు అప్పలనాయుడు



రామభద్రపురంలో సీతంరాజును గెలిపించాలని కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రాజాం సిటీ: బొద్దాంలో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా యువకుల ప్రచారం



రాజాం: మొగిలివలసలో వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం



రేగిడి: వండానపేటలో సుధాకర్‌కు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్‌మోహనరావు



మెంటాడ: సుధాకర్‌కు ఓటు వేయాలని ఎంపీడీఓ సిబ్బందిని కోరుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

జిల్లాలో నేరాలు తగ్గుముఖం

- వంగర పోలీస్‌స్టేషన్ తనిఖీలో ఎస్పీ దీపికా ఎం.పాటిల్



వంగర: పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

వంగర: జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయని ఎస్పీ దీపికా ఎం.పాటిల్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆమె అక్కడి రికార్డులు పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో సమావేశమైన ఆమె సైబర్ క్రైమ్, లోన్‌యాప్స్, బాల్యవివాహాల నిర్మూలన అంశాలపై అవగాహన కల్పించారు. సమాజంలో జరుగుతున్న మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. అనంతరం సమస్యాత్మక గ్రామాలపై ఆరాతీశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ ప్రతీ శనివారం పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, వాటి రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారని, ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో పోలీస్ ఉద్యోగుల సమస్యలకు సంబంధించి, స్పెషల్ డ్రైవ్ చేపట్టి వినతులు స్వీకరిస్తామని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ మోహనరావు, రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర, ఎస్‌ఐ బుడుమూరు లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు..

రేగిడి: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ దీపికా ఎం.పాటిల్ తెలిపారు. సోమవారం మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 72 పోలింగ్ కేంద్రాల వద్ద పర్యవేక్షణకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలోపు టెంట్లు వేయడం, ప్రచారం చేయడం, గుంపులు గుంపులుగా ఉన్నా, ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రయత్నించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఆమె వెంట సీఐ ఉపేంద్రరావు, ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు, ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు ఉన్నారు.

పంచాయతీల వారీగా పట్టభద్రుల ఓటర్లను గుర్తించండి



సూచనలిస్తున్న వైఎస్సార్ సీపీ నేత రాజగోపాలనాయుడు

రాజాం: మండలంలోని ప్రతీ పంచాయతీలో పట్టభద్రుల ఓటర్లను గుర్తించాలని వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు సూచించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలతో సమావేశమైన వారు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న నర్తు రామారావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి, పార్టీ సత్తా మరోసారి చాటాలని కోరారు. ఓటర్ల జాబితా ఆధారంగా ఇంటింటికీ వెళ్లి, పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, మండల సచివాలయాల కన్వీనర్ కామోదుల శ్రీరంగంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలకు చర్యలు



సచివాలయంలో ఎన్నికల సమాచార పత్రం ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: మండలంలోని లక్ష్మీపేట, ఓనెఅగ్రహారం గ్రామ సర్పంచ్‌ల ఎన్నికలతో పాటు కొట్టిశ, ఇరువాడ, కొప్పరవలస, రుషింగి గ్రామాల్లో పలు వార్డు మెంబర్ల ఎన్నికలకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్, సచివాలయం వద్ద ఎన్నికల నిర్వహణకు సంబంధించి, సమగ్ర సమాచారంతో కూడిన పత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దురదృష్టవశాత్తు ఇటీవల ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు మృతి చెందడంతో ఆయా పదవులు ఖాళీ అయ్యాయని, వాటికి త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎవరికైనా అభ్యంతరం ఉంటే ఈ నెల 7వ తేదీలోగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎల్.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోజుకు రూ.257 వేతనం



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో కారి చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ బాసూరి శంకరరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన కొలతల్లో బాగా పనిచేస్తే రోజుకు రూ.257 వేతనం వస్తుందన్నారు. రెండు పూటలా పనిచేయాలని, వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ



ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎస్‌ఓ సురేష్

బొబ్బిలి రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విధులు నిర్వహించనున్న సిబ్బందికి విధుల నిర్వహణపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఓ సురేష్ పోలింగ్ రోజు పాటించాల్సిన జాగ్రత్తలు, పోలింగ్ అనంతరం పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. తహసీల్దార్ రాజారావు, సీఎస్‌డీటీ ఆర్.సాయికృష్ణ, ఆర్‌ఐ కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

విత్తనగుళికల సాగుతో రైతుకు మేలు



విత్తనగుళికల తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



రేగిడి: సోమరాజుపేటలో విత్తనగుళికలు తయారీని ప్రయోగాత్మకంగా వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం సిటీ: విత్తనగుళికల సాగుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ఎం.టి.కిరణ్ అన్నారు. సోమవారం మండలంలోని పొగిరి గ్రామంలో విత్తనగుళికల తయారీ, సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా విత్తనాలను గుళికలుగా తయారు చేసుకోవడం ద్వారా సకాలంలో వర్షాలు కురవకపోయినా మొలకలు వస్తాయని తెలిపారు. పొడి వాతావరణంలో వీటిని చల్లుకోవడం ద్వారా తేమశాతంతో సూక్ష్మ వాతావరణం వృద్ధి చెందుతుందన్నారు. వీటి తయారీకి బీజామృతంతో తొలుత విత్తనశుద్ధి చేసి, ఘనజీవామృతం, బంకమట్టి, బూడిద, తగినన్ని నీళ్లు ఒకదాని తర్వాత ఒకటి విత్తనాలపై పోయడం ద్వారా గుళికలు తయారవుతాయన్నారు. వీటిని నీడలో ఆరబెట్టిన తర్వాత విత్తుకోవాలన్నారు. ఇవి నేల నుంచి పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్లను నివారిస్తాయన్నారు. కార్యక్రమంలో పీఆర్‌పీ రమాదేవి, ఐసీఆర్‌పీ పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని సోమరాజుపేటలో విత్తనగుళికల తయారీపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ సీహెచ్ శారద విత్తనగుళికల తయారీ, వాటి లాభాలు వివరించారు. విత్తనగుళికలుగా అనుములు, కందులు, మినుములు, పెసలు, జొన్నలు, సజ్జలు, అలసందలు, మొక్కజొన్న వంటి పలు రకాల విత్తనాలను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.రమేష్‌నాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ అసిరినాయుడు, ఐసీఆర్‌పీలు తవిటినాయుడు పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ

- ఎస్‌బీఐ ఆర్‌ఎం సీవీ సుబ్రహ్మణ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం సీవీసుబ్రహ్మణ్యం

విజయనగరం అర్బన్: అత్యధిక వడ్డీ ప్రయోజనం కల్పించే ఫిక్స్‌డ్ డిపాజిట్లను అందుబాటులో తీసుకువచ్చామని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎస్‌బీఐలో అత్యధిక వడ్డీ ప్రయోజనాలిచ్చే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అవగాహన కల్పిస్తూ సోమవారం నగరంలో ర్యాలీ చేపట్టారు. ఎస్‌బీఐ ఆర్‌ఎం కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్యాంకింగ్ రంగంలో వినియోగదారులకు అధికవడ్డీ ప్రయోజనం కలిగించే పలు పథకాలను ఎస్‌బీఐ అందిస్తోందన్నారు. అందులో అమృతకలశ్, సర్వోత్తం డిపాజిట్లు ముఖ్యమైనవన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఎంపీఎస్‌టీ అధికారి బండారు సూర్యారావు, ఎస్‌బీఐ కంటోన్మెంట్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ జయంతి శ్రీనివాసరావు, పట్టణంలోని వివిధ బ్రాంచ్‌ల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణం



పెనుబాకలో వేస్తున్న సీసీ రోడ్డు

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కంబాల జోగులు, జెడ్పీటీసీ బండి నర్సింహులు చొరవతో గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, సీసీ రోడ్డు నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపడుతుండగా గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు

బొబ్బిలి రూరల్: మండల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీఓ అల్లు భాస్కరరావు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశమైన ఆయన వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. అర్హులకే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, ప్రతిఒక్కరూ చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి మంచి గుర్తింపు సాధించాలని కోరారు. వేసవి నేపథ్యంలో మండలంలోని ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

పక్కాగా సరిహద్దుల గుర్తింపు



సచివాలయ సర్వేయర్‌కు సూచనలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వేలో సరిహద్దుల గుర్తింపు పక్కాగా జరగాలని, ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సూచించారు. సోమవారం మండలంలోని పెరుమాళి గ్రామంలో జరుగుతున్న భూ సరిహద్దుల గుర్తింపును పరిశీలించిన ఆయన భూముల సరిహద్దులు గుర్తించినప్పుడు సంబంధిత భూముల రికార్డులు, డ్రోన్ కెమెరాతో తీసిన ఛాయాచిత్రాలు, రైతులను దగ్గర ఉంచి సరిహద్దులు గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యప్రణాళిక తప్పనిసరి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ఉపాధ్యాయులంతా తరగతులకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా లెస్సన్ ప్లాన్(పాఠ్యప్రణాళిక) వెంట తీసుకురావాలని ఎంఈఓ జె.త్రినాథరావు సూచించారు. సోమవారం మండలంలోని అరసబలగ గ్రామ పాఠశాలను సందర్శించిన ఆయన ఉపాధ్యాయుల డైరీ, పాఠ్యప్రణాళికలు, మరుగుదొడ్లు, జగనన్న గోరుముద్ద పథకం అమలుపై ఆరాతీశారు. లెస్సన్ ప్లాన్ ద్వారా విద్యార్థులకు బోధిస్తే ఎటువంటి విషయమైనా వారికి సులభంగా అర్థమవుతుందన్నారు. అనంతరం విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు.

'జగనన్నకు చెబుదాం'..

సమస్యలు పరిష్కరించుకుందాం!



సంతకవిటి: స్పందన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



రాజాం: మహిళ అందిస్తున్న వినతిపత్రం స్వీకరిస్తున్న ఎంపీడీఓ శంకరరావు



బొబ్బిలిరూరల్: అధికారులకు వినతిపత్రం అందిస్తున్న మహిళ



తెర్లాం: మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: ప్రజాసమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారుల సమక్షంలో ప్రతీ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నామని, ఎవరైనా సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమంలో అర్జీ(దరఖాస్తు) పెట్టుకోవచ్చన్నారు. వినతులు స్వీకరించిన కొన్నిరోజుల్లోనే సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం నిర్వహించగా, పలువురు తమ సమస్యల పరిష్కారానికి అధికారులకు వినతులు సమర్పించారు. వాటిని పరిశీలించిన తహసీల్దార్ డి.ఐజాక్, ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

బొబ్బిలి రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి పలువురు విచ్చేసి, సమస్యల పరిష్కారానికి వినతులు సమర్పించారు. ఆయా వినతులు పరిశీలించిన తహసీల్దార్ ఎన్.రాజారావు, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యక్రమంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా తెలుస్తున్న ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ హరనాథ్, ఐసీడీఎస్ పీఓ సిమ్మాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పలు సమస్యలపై సమర్పించిన వినతులను పరిశీలించిన ఎంపీడీఓ బాసూరి శంకరరావు ప్రతీ సోమవారం ఇక్కడ జరిగే ఈ కార్యక్రమం ద్వారా సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ ప్రభాకరరావు, ఏపీఓ సాయిరాం పాల్గొన్నారు.

సంతకవిటి: గ్రామసచివాలయాల్లో ప్రతీ సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి సురేష్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశమైన ఆయన పలువురు సమర్పించిన వినతులను తీసుకుని, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం పలు అభివృద్ధి పథకాలపై సమీక్షించారు. లబ్ధిదారులకే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, తహసీల్దార్ ఎ.సులోచనారాణి పాల్గొన్నారు.